


# ఆటకట్టు

మల్లాది లక్ష్మణ శాస్త్రి

మనిషి చేతస్సులో ఎన్ని అగాధాలుంటాయో, వాటిలో ఎన్నెన్ని సంఘటనలు, అధ్యాయాలు పేర్చుకు పోతాయో మానవ మేధస్సుకి అంతు పట్టని విషయం. పైవాడు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు, చెయ్యిచాచి అటకమీది గుండిగ కెలికి ఓ పాత వస్తువుని పైకిలాగి మనిషికి అందిస్తాడు.

గత ఏభై పైచిలుకు సంవత్సరాలుగా ఆర్.ఎస్.కే. మూర్తి అధ్యాయం నా అంతరాళాల్లో దాగి ఉంది. ఈరోజు అకస్మాత్తుగా ఉపరితలానికి వచ్చింది. మూర్తిగారి కథ ఇన్నాళ్ళుగా నేనెందుకు నెమరు వేసుకోలేదో, ఆప్తులకి సైతం ఎందుకు చెప్పలేదో పైవాడికి తెలియాలి. ఈరోజు మీకు చెప్పుకుని కొంత పరిహారం చేసుకుంటాను.

ఈకథలో రెండే పాత్రలు. నేను, నాకంటే యాభయి వసంతాలు వయసులో పెద్దయిన మూర్తిగారు. ముందే చెప్తున్నాను. ఏకథలోనైనా పాఠకుడు ఎదురుచూసే ట్విస్టులు, రొమాన్సులు, హీరోవిలన్లు, ఉదాత్తోన్నత వ్యక్తులు, శోకతప్త హృదయాలు, ఏవీ ఈ కథలోలేవు. 'సందేశం' కలికానికైనా లేదు. కనీసం ప్రకృతి వర్ణనలు కూడా లేవు. అయినా ఒప్పుకుని చదువుతానంటారూ, మీ ఇష్టం.

మూర్తిగారు ఆరడుగుల మనిషి, స్ఫురద్రూపి, అరవై పైబడ్డ వయస్సులోనూ కండలు తిరిగిన శరీరం.

ఇక నేను; నన్ను మా తాతయ్య జీలకర్రశాస్తుల్లూ అని పిలిచే వాడు. మూర్తిగారు నన్ను ఎందుకనో "టప్పయ్య" అని సంబోధించేవాడు.

ప్రయత్నపూర్వకంగా నైతేనేమి, తన అహం ప్రదర్శించుకోవటానికి అందుబాటులో ఉన్న ఏకైక పంచ్ బాగ్ నేనే నైతేనేమి మానాన్న నన్ను పరమ భీరువుగా తయారుచేశాడు. బాహ్యంగా ప్రచండ రూపం అయితే అయి ఉండవచ్చు, ఆయన మానసిక బలహీనతలు ఆయనవి. మనిషి లోన ఉన్న డొల్ల బయటికి ఉగ్రతగా ప్రకటితమౌతుంది. ఇంట్లో ఆయన నన్ను చేసిన మానసిక అణచివేతని, సగటున నాకంటే రెండుమూడేళ్ళు వయస్సులో పెద్దవాళ్ళయిన, నాకు అర్థమవని బూతులు అనర్గళంగామాట్లాడగలిగిన, మునిసిపాలిటీ బడిపిల్లలు నా భీరుత్వాన్ని, నిస్సహాయత్వాన్ని ద్విగుణీకృతం చేశారు. (ఎనిమిదేళ్ళప్పుడు, నాకు పదేళ్ళని రాసి ఫస్ట్‌ఫారంలో చేర్చార్లెండి.)

పన్నెండు సంవత్సరాల పిన్నవయసులోనే విధి బాహ్యద్వారాలు ఒక్కొక్కటీ మూసేసుకుంటూ వస్తే వ్యక్తి మేధాప్రవాహాలు అంతర్ముఖం కాక ఏమవుతాయి? నాకూ అదే జరిగింది. గోళీలాటలు, బొంగరాలాటలు, కోతికొమ్మచ్చాటల్లో నన్ను ఎవరూ చేర్చుకునేవారు కాదు. నేను చేతకాని బక్కపీనుగనికదా.

తెరిచిన కళ్ళకి కనిపించే రంగురాళ్ళు రౌడీమనుషులు ఎగరేసుకుపోతేనేం, కళ్ళుమూసుకున్నా కనిపించే కోహినూర్ల కమనీయత ఎవరు దొంగిలించగలరు? మొదటిసారి 'ఇన్ఫినిటీ' అన్న పదాన్ని లెక్కలమాష్టారు ఉచ్చరించితే ఎక్కడికో వెళ్ళిపోయాను, అంతర్ముఖంగా. ఆకాశం, సముద్రం, భూదేవి—సామాన్యమైన పదాలా ఇవి? మనసున్న మనిషిని మామూలుగా బతకనిచ్చే పదాలా ఇవి? ఇంత ఉధృతం, ఇంత ఆనందం ఎలా ఇముడ్చుకోగలను? నాకంత పాత్ర లేదే!

మూర్తిగారు తన పాత్ర నాముందుంచారు. ఆ పాత్రలో ఆప్యాయత ఉంది, ఆత్మీయత ఉంది. వ్యక్తిత్వం రూపుదిద్దుకోటానికి వ్యక్తత అవసరం. ఆయనతో నాలుగు మాటలు మాట్లాడితే, మేఘాలు చీల్చుకుని వందల మైళ్ళు వ్యక్తి ఎగురుకుంటూ వెళ్ళి, ఆఎత్తు నుంచి భూమి గుండ్రతలో లావణ్యాన్ని చూసి మైమరచినట్లుండేది. వ్యక్తిత్వం చిగురించసాగింది. నా నోరూ విప్పతగినదే అని తెలిసింది.

మూర్తి గారిది ఇంకొకరకమైన ఒంటరితనం. భార్య పోయి ఇరవై ఏళ్ళయింది. ఉన్న ఒక్క కొడుకూ డిగ్రీ అయిందనిపించుకుని, పెళ్ళి చేసుకుని మూర్తిగారికి దూరంగా వేరే ఊళ్ళో గుమాస్తాగిరీ చేసుకుంటూ బ్రతుకుతున్నాడు. అతని పేరు ప్రజ్ఞానంద. అతనికి తండ్రికున్న చిన్న వ్యాపారం నడుపుకోవటం గిట్టలేదు. తండ్రిపోడ అంతకన్నా గిట్టలేదు. బ్రతుకు దారిలో ప్రజ్ఞ సంపాదించుకో లేకపోయాడు, ఆనందం దొరికిన దాఖలాలూ లేవు.

మూర్తి గారికీ నాకూ ఆరుసంవత్సరాల సుదీర్ఘ స్నేహం. థర్డుఫాం నుంచి నా రెండో సంవత్సరం ఇంజనీయరింగ్ దాకా. మూర్తిగారివంటి మంచి వ్యక్తికి ఆస్తి తగాదాలు, కోర్టుకేసులు ఎందుకు ఉండేవో తెలియదు కాని దాదాపు రోజూ మా ఇంటికి వచ్చేవాడు. ప్లీడరుగుమాస్తా గారితో పదినిమిషాలు, మానాన్నతో పదినిమిషాలు వ్యవహారాలు మాట్లాడుకున్న తర్వాత ఆయనకి నాతోనే పని. "టప్పయ్యా! బోర్డు తియ్యి!" అనేవాడు. క్రమం తప్పకుండా చదరంగం ఆడుకునే వాళ్ళం. చదరంగంతో పాటుగా కబుర్లూ ఆడేవాళ్ళం. తొలిరోజుల్లో నన్ను చిత్తుగా ఓడించే వాడు. ఆయనతో ఓడితే ఎందుకో గెలిచినంత ఆనందంగా ఉండేది. ఓటమిలోంచి ఎన్నో కొత్తసంగతులు తెలిసేవి; చదరంగపు మెళకువలతో పాటుగా, జీవితం ఆనుపానులు కూడా నేర్చుకునే వాడిని. నేను మంచి ఎత్తు వేసినపుడు ఆనందించి మెచ్చుకునేవాడు. గుర్రమో ఏనుగో చచ్చిపోయినపుడు "ఏది శాశ్వతం!?" అనేవాడు. అప్పుడప్పుడు, "చెస్ ఆటకాదోయ్, కళ!" అనేవాడు. 'ఎటాక్ కళైతే డిఫెన్స్ ఇంకా పెద్ద కళ'. మా ఆటలో ఎక్కడనించి ఊడిపడిందో తెలియకుండా తెలుపువారినుంచో నలుపువారినుంచో ఒక మెరుపుతీగలాటి ఎత్తు పడేది. వేదికమీద ఎవరో గొప్ప కళాకారిణి చేస్తున్న నృత్యప్రదర్శన చూసి ఆనందించినట్లు మా ఆట చూసి మేమే ఆనందించే వాళ్ళం.

నేడు మనిషి మెషిన్‌కి చెస్ నేర్పి, మెషిన్ నుంచి యాంత్రిక చెస్ తిరిగి నేర్చుకుంటున్నాడు. మనిషి కంప్యూటర్‌ని గెలవడం దుస్సాధ్యమైపోయినంత దౌర్భాగ్యం. బానిస యొక్క కబంధ హస్తాల్లో యజమాని నలిగి పోతున్నాడు. మేధని కృత్రిమ మేధ నిర్వీర్యంచేస్తోంది.

ఈనాడు ఆయనని తలుకుని, "చెస్ లోంచే కాదు మాష్టారూ, అన్ని 'కళ'ల లోంచీ కళ ఆవిరయిపోతోంది", అనుకుని నిట్టూరుస్తున్నాను.

ఆర్.ఎస్.కే. మూర్తిగారు ఊళ్ళో జరిగే చెస్ టోర్నమెంట్లు ప్రతిదీ తప్పక ఆడేవాడు. చాలా వాటిలో మొదటి ప్రైజు గెలుచుకునే వాడు. అధమపక్షం వందరూపాయలు ప్రతిసారీ ఇంటికి తీసుకెళ్ళే వాడు. ఒకసారి పత్రికలో 'ఆరెస్కే ప్రత్యర్థిని అరేస్కున్నాడు.' అని పడింది. ఆయన సిసిలియన్ డిఫెన్సులో డ్రాగన్ వేరియేషన్ మహా గొప్పగా ఆడేవాడు. వైట్ వచ్చిన ప్రత్యర్థి ఆయన్ని డ్రాగన్ ఆడనిస్తే మూర్తి గెలిచినట్లే లెక్క. నాకు ఓడినా ఆనందమే కాబట్టి ఆయన్ని డ్రాగన్ వేయనిచ్చే వాడిని. కొంత అనుభవం వచ్చిన తర్వాత ఒకరోజు నేను ఆయన డ్రాగన్ని ఛేదించి ఆటకట్టించాను. ఆరోజు ఆయనకంటే నేనే ఎక్కువ ఆశ్చర్యపోయాను. ఆ తరువాత రకరకాల రక్షణాత్మక ఎత్తులు ప్రయోగించి చూశాడుగానీ, ఎందుకనో నాముందు ఆయన డ్రాగన్ నిలువలేదు. కొన్ని ఆటల తర్వాత, "టప్పయ్యా, డ్రాగన్‌కి కళ్ళెంవేసి

కట్టేసుకున్నావు. ఇకనుంచీ వేరే ఓపెనింగ్లు ఆడుకుందాం" అన్నాడు, ఇంకో దేశం చూద్దాం పద, అన్న ధ్వనితో. ఆ తరువాత రుయీ లోపెజ్, క్వీన్స్ గాంబిట్ ఎక్కువగా ఆడేవాళ్ళం.

నాకు పదమూడేళ్ళ వయసపు డనుకుంటా. ఫిఫ్త్ ఫారం రోజులు. ఆకలి కవిత్వం ప్రజాదరణపొందిన దశ తర్వాత పరిణామక్రమంగా సోషలిజమ్ ఊపు తగ్గుతున్న దశ. పలకా బలపం ఉపయోగించి ఒక 'గేయం' రాశాను విప్లవ కవిత్వానికి పారడీగా, సినారె వారి "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ" బాణీలో, పై వాక్యంలో ఏ ఒక్క పదానికీ అర్థం తెలియని అమాయకత్వంలో. సోషల్ స్టడీస్‌లో అత్తెసరు పాసయినా, తెలుగులో మార్కులు బానే వచ్చాయి కదా! గేయానికి "ఆత్మ ఘోష" అని నామకరణం కూడా చేశాను. మా అమ్మ చదివి, "బావుందిరా, కాగితం మీద రాసి ఎవరికన్నా పంపించు", అని స్టాంపు డబ్బులిచ్చింది.

సంపాదకుడికి ఏమయిందో తెలియదు, ఆంధ్రపత్రికలో "ఆత్మ ఘోష" అచ్చయింది.

అచ్చులో నాపేరు చూసిన నలుగురు ఇంటా బయటా, "ఆహా, అవునా" అన్నారు. మూర్తిగారు మాత్రం మహదానందపడిపోయారు. ఒకటికి పదిమాట్లు చదువుకున్నారు. నా చేత చదివించారు. గేయంలో మూల భావమేమిటో, అందులోని నిగూఢత ఏమిటో నాకు అయిదు సెషన్స్ లో బోధ పరిచారు. నేనూ అర్థమయిందన్నట్లు తలూపాను.

★★★

మా నాన్న పనిమీద పంపిస్తే ఒకసారి మూర్తిగారి ఇల్లు చూడటం తటస్థించింది. అతిథులు కూర్చోనటానికి నాలుగు కుర్చీలు వేశాక పెద్దగా చోటు మిగలని ముందు గది, చిన్న వంటగది, మధ్యలో ఒక పెద్ద హాలు. వంటగదిలో చిన్న స్టవ్. నాలుగు ఇత్తడిగిన్నెలు, అయిదారు డబ్బాలు తప్ప మరేమీ సామాన్లు లేవు. ప్రస్ఫుటంగా కనిపించేవల్లా తేనెతో నిండి ఉన్న హార్లిక్స్ సీసాలు. ఆయన రోజుకి పావు లీటరు తేనె సేవిస్తాడట. అదే ఆయన ముఖ్యాహారం. ఈవిషయం నాకు ఇదివరకే అర్థమయేలా చెప్పాడు. గంభీరమైన విషయం తన నోట్లోనుంచి వెలువడిందని ఆయనకి తోచినప్పుడు వాక్యం చివర్లో నిదానంగా కళ్ళు మూసేవాడు. రెప్పలు పూర్తిగా మూసుకోవటానికి అయిదు సెకన్లు పట్టేది. ఆ తరువాత మరో అయిదు సెకన్లు మౌనం. ఈ మౌనసమయంలో శ్రోత తన వాక్యంలోని అంతరార్థాన్ని కొంతైనా జీర్ణించుకోవాలని ఆయన ఉద్దేశ్యం కాబోలు. తేనె విషయం వచ్చినప్పుడల్లా ఈ కన్నుమూత ప్రక్రియ తప్పకుండా ఉండేది. "తెలియనాళ్ళని ఏమయినా చెప్పనీ. తేనె సంపూర్ణాహారం. నా ఈ శరీరం, మెదడు తేనెతో నిర్మింపబడినవే. ఉబుసుపోక తేనెతో

అనుబంధంగా, అనుపానంగా కొన్ని పప్పులు, పళ్ళు తింటే తింటాను. పొయ్యి వెలిగించే పని ఎప్పుడోగాని ఉండదు."ఆయన చెప్పిందానికి సాక్ష్యంగా ఆయన శరీరం తేనెరంగులో మెరుస్తూ ఉంటుంది. మందులతో అవసరం లేని ఆరోగ్యం ఆయనది. కనీసం ఆయుర్వేద మందులుకూడా వాడి ఎరుగడు. కళ్ళజోడు వాడే అవసరం రాలేదు, వినికిడి శక్తి తగ్గలేదు.

"మా ఇంట్లో తినేవారుగాని, యాభై సంవత్సరాలయింది నేను మాంసాహారం ముట్టి."

మూర్తిగారు స్వచ్ఛమైన తేనె నర్సీపట్నం అడవులనించి తెప్పించుకునే వాడు. సిసలైన తేనె అమృతమైతే కల్తీ తేనె విషంతో సమానమనే వాడు. ఆయన తెప్పించుకునే తేనె ఎక్కడన్నా రెండు చుక్కలు పడితే తినటానికి తేనెటీగలు వస్తాయట!

ఆయన హాలు శోభ చూసితీరవలసిందే. నాలెక్క ప్రకారం నలుగురైదుగురు కంటే ఎవరూ ఆహాలుని చూసి ఉండరు. ఎవరు చూస్తారు? బంధుమిత్రులు లేరు, పనిమనుషులు లేరు. ఇరవై ఆడుగుల పొడుగు, పన్నెండుగుల వెడల్పు, తూర్పు ఎండ పడేందుకు వీలుగా పెద్ద కిటికీ, మద్రాసు టెర్రేసు. గది శుభ్రంగా ఉంది. చాలా వస్తువులున్నప్పటికీ అన్నీ అమర్చినట్లు పొందికగా ఉన్నాయి. ప్రతి ఘనపుటడుగూ మూర్తిగారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోంది. మరి ఆయన జీవిస్తోంది ఆ హాల్లోనే కద! ఒక ఆరడుగుల షెల్ఫు నిండా వ్యాయామ సామగ్రి ఉంది. రకరకాల బరువులు, కడ్డీలు, స్ప్రింగులు. తాళ్ళు పేర్చి ఉన్నాయి. అవి నిత్యం ఉపయోగిస్తాడనటానికి తార్కాణంగా ఆయన కండలు, దార్ఢ్యం కనిపిస్తూనే ఉన్నాయి. ఒక వరసలో కొన్ని ఈత చాపలు, ఒక కృష్ణాజినం ఉన్నాయి. నైరుతి మూల ఒక మేజాబల్ల, దానిమీద విక్టోరియన్ కాలంనాటి టేబుల్ లాంప్ ఉంది. బల్లకి సరిపోయే కుర్చీయే కాక గోడకి మడిచిపెట్టిన ఇంకో పడకకుర్చీ ఉంది. బహుశః మూర్తిగారు నిద్రించేది ఆ కుర్చీలోనే.

"శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికి రోజుకి నాలుగు గంటలు సరయిన నిద్ర చాలు. మనిషి ఆరోగ్యానికి అదే కొలమానం. అంతకి ఎక్కువైనా, తక్కువైనా మనిషి శరీరాన్ని, శరీరం మనస్సునీ పద్ధతిగా పెంచలేదని అర్థం." అని నాకొకమారు ఉద్బోధించి నిదానంగా కళ్ళు మూసి పదిసెకన్లు మౌనం పాటించారు మూర్తిగారు.

ఇంకో చిన్న టేబుల్ మీద నలుపురంగు గ్రామొఫోన్ ఉంది. తెరిచి పెట్టి ఉంది. వినటానికి తయారుగా ఉంచిన 78 ఆర్.పీ.ఎమ్. రికార్డు మధ్యలో ఎచ్.ఎమ్.వీ. వారి కుక్క తన్మయత్వంతో సంగీతం వింటున్న బొమ్మ ఉంది.

గ్రామోఫోన్ కంటే, పెట్టెకి కుడివైపు ఉన్న కీ ఇచ్చే హాండిల్ నాకు ఎక్కువ ముచ్చటగా తోచింది. ఒకసారి ఫుల్‌గా చేత్తో కీ ఇస్తే రెండు 78 రికార్డులు ఇంపుగా పాడతాయి. కీ ఇవ్వడం మర్చిపోయి మూడో రికార్డు పెడితే ఘంటసాల గొంతుకూడా గార్దభస్వరం అందుకుని, రికార్డు అలిసిపోయి పాట మంద్రస్వరం పెంచుకుంటూ పోయి చివరికి ఆగి పోతుంది, మానవజీవితం లాగా. చిత్తూరు నాగయ్య, కుందన్ లాల్ సైగల్, పుష్పవల్లి తరంవారి రికార్డులు ఒక ఖానాలో ఉన్నాయి. హాలులో అతి ముఖ్యమైనది పుస్తకాల బీరువా. అధమ పక్షం అయిదు వందల పుస్తకాలు తలుపుటద్దాల వెనకనించి దర్శనమిస్తున్నాయి. సింహభాగం తెలుగు పుస్తకాలే. కొన్ని చెస్ పుస్తకాలు. అన్ని చెస్ పుస్తకాలు తనవద్ద ఉన్నట్లు ఈయన నాకెందుకు చెప్పలేదుస్మా అనుకున్నాగానీ బయటికి అనలేదు. ముఖ్యంగా కొట్టవచ్చినట్లు కనిపిస్తున్న "M.C.O." Modern Chess Openings. ఆ పుస్తకం ఎక్కడ దొరుకుతుందో నని నేను చాల కాలంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు మూర్తిగారికి తెలుసు. నాకు అరువు ఇచ్చి ఉండవచ్చు. కానీ ఆయనని తప్పు పట్టడానికి నాకేం హక్కు? చెస్‌లో నాకు నాలుగెత్తులు వచ్చంటే ఆయన చలవేకదా. జీవితంలో స్నేహితుడంటూ ఉంటే ఆయనొక్కడే కదా! సమాజం అనే అడవిలోకి చొచ్చుకుపోయే మార్గం చూపించింది ఆయనే కదా!

ఆత్మనిర్భరత ఉన్న వ్యక్తికి అటువంటి ఇల్లు స్వర్గధామం కదా అనుకున్నాను పదిహేనేళ్ల ప్రాయంలో ఆనాటి నేను.

★★★

మూర్తిగారు స్వచ్ఛమైన తెలుగు మాట్లాడే వారు. ఆయన వాడే కొన్ని పదప్రయోగాలు వాడుక భాషకంటే పుస్తకభాషలో ఎక్కువ ఉపయోగించదగ్గవిగా అనిపించేవి నాకు. ఆయన స్థాయిలో తెలుగు ఎప్పుడు మాట్లాడగలగనో కదా అనుకునే వాడిని. కాని ఆయన ఎందుకో 'వాళ్ళు', 'వాళ్ళని' అనవలసి వచ్చినపుడు 'ఆళ్ళు, ఆళ్ళని' అనే వారు. వినటానికి వింతగా ఉండేదికానీ క్రమేపీ అలవాటుపడిపోయాను. ఈరోజుల్లో అధికాంశం రాజకీయవేత్తలు, 'చెప్తున్నాను, అంటున్నాను' అనటానికి బదులుగా "చెప్తా ఉన్నాను, అంటా ఉన్నాను" అంటుంటే వినివిని మనం అలవాటు పడిపోయినట్లు. పైపెచ్చు చెప్తా లో 'ప్తా' కి ఎంత దీర్ఘం ఇచ్చి సాగదీస్తే అంత వక్కాణించినట్లట.

మూర్తి గారు తెలుగులో ఉద్దండులే కానీ, ఆయన ఇంగ్లీషు పరిజ్ఞానం చెప్పుకునేంతగా లేదు. హిందీ విషయానికొస్తే రాదనే అనుకోవాలి. అటువంటాయన ఒకరోజు నన్ను, "నవరంగ్ సినిమా చూశావా టప్పయ్యా?" అని అడిగేసరికి నిర్ఘాంతపోయాను. నాకు తెలిసి ఆయన సినిమాలు చూడరు. నా కోటా ఏడాదికి మూడు సినిమాలు. స్కూలు

పరీక్షలయిపోయిన రోజు నేనూ, చెల్లాయి నేలటిక్కెట్టు కొనుక్కుని పెద్దవాళ్ళు అనుమతించే లవకుశ, మూగమనసులు వంటి సినిమాలకి వెళ్ళే వాళ్ళం. "శాంతారాం మనిషి కాదోయ్. ఋషి. ఆ సినిమా నిర్మాణంలో తెర వెనకాతల పనిచేసారే, ఆళ్ళూ ఋషులే. శాంతారాం సినిమాలు నేను వదలను. వీలయినప్పుడు నువ్వూ చూడు", అంటూ నవరంగ్ సినిమాని పావుగంట సేపు అది ఎంత కళాఖండమో వర్ణించి చెప్పారు. కళని ఆస్వాదించటానికి భాష అడ్డురాదని నాకు ఆరోజు అర్థమయింది. హిందీ పండితులకంటే, నాలుగు మాటలు కూడా హిందీ రాని మూర్తిగారికి నవరంగ్ ఎక్కువ అర్థమయింది.

★★★

స్వభావతః వయసు పెరిగేకొద్దీ నా ఆలోచనల్లో పరిణతి రాసాగింది. మాట్లాడదగిన ఇద్దరు ముగ్గురు స్నేహితులని కూడా కాలం నాకు సంపాదించి పెట్టింది. యధాప్రకారం మూర్తిగారు ఇంటికి వస్తూనే ఉన్నాడు, నాతో కబుర్లు చెప్పటానికి, వీలయతే ఒక ఎత్తు వెయ్యటానికి ఎదురు చూస్తూనే ఉన్నాడు. వెనుకటివలె ఆయనకి ఎక్కువ సమయం కేటాయించలేక పోతున్నాను. కేటాయించ లేకపోతున్నాను అనటంకంటే ఆయన కబుర్లలో నాకు రుచి తగ్గిందనటం నిజానికి దగ్గర మాట. ఆయనపట్ల నాకున్న ఆరాధ్య భావం, గురుభావం క్రమేపీ తగ్గి, వాటి స్థానంలో స్నేహభావం, సమానత్వ భావం చోటుచేసుకున్నాయి. తనని మునపటిలా గౌరవించటం లేదని ఆయన గుర్తించి నిరుత్సాహ పడేవాడని కూడా నాకు తోచింది.

శిష్యుడికి గురువు ఎంత అవసరమో, గురువుకి శిష్యుడు అంతే అవసరం. ప్రతి ద్వంద్వంలో అంశాలు పరస్పరాధారితాలే. రాజు ప్రజ, భార్య భర్త, పగలు రాత్రి, సుఖం దుఃఖం, చివరకి భగవంతుడు భక్తుడు; ఒకరు లేక ఒకరు లేరు.

మూర్తి గారి వ్యక్తిత్వంలో ఏదో బలహీనత కానవస్తోంది. చదరంగంలో ఆయన పాటవం తగ్గిపోయింది. కొత్త తరం వారు జాతీయ స్థాయిలో ఆడుతున్నారు. వరసగా మూడు టోర్నమెంట్లలో, పై అయిదుస్థానాల్లో నిలుస్తూ వచ్చే మూర్తి గారు క్రింద నుంచి అయిదు స్థానాలలో తేలాడు. పూలమ్మిన చోట కట్టెలమ్మడం ఇష్టం లేక చెస్ టోర్నమెంట్లు ఆడటం మానేశాడు. ఉన్న షాపు, వ్యాపారం వచ్చిన రేటుకి అమ్మేశాడు. కోర్టుకేసులు కొన్ని గెలిచి, మరికొన్ని ఓడాడు. కోర్టుకు వెళ్ళవలసిన అవసరం లేకుండా పోయింది. చిరకాలంగా అలవాటయిన ఆ కాలక్షేపం కూడా దూరమయింది. మూర్తిగారు మరీ ఒంటరి వాడయ్యాడు.

పి.యు.సీ చదవటానికి నేను కాలేజీలో చేరాక ఆయనని కలవడం బాగా తగ్గిపోయింది. ఆరు నెలల వ్యవధి తరువాత ఒకసారి కాలేజీనుంచి ఇంటికి వస్తుండగా మూర్తిగారు నన్ను కేకవేసి పిలిచాడు. సైకిల్ దిగి నమస్కరించాను. "నా పుస్తకాలు రెండు అచ్చయాయోయ్, పోస్టాఫీసు నించి వస్తున్నాను. లైబ్రరీలకి పుస్తకాలు పార్సెల్ చేసి వస్తున్నాను."

ఒకరకంగా సంతోషించాను. ఎలాగైతేనేం, మూర్తిగారికి మంచి వ్యాపకం దొరికింది. జీవితానికి ఒక ఆలంబన దొరికింది. "ఏ సబ్జెక్టుమీద రాశారు మాష్టారూ? నాన్‌ఫిక్షన్ అయి ఉంటుంది", కొంచెం జంకుతూనే అడిగాను.

"వ్యక్తిత్వ వికాసం ఉద్దేశించి రాశాను." ఆయన కళ్ళలో గర్వం తొణికిసలాడుతోంది. "ఉభయభాషా ప్రయోగం. ఇంగ్లీషు, తెలుగు కలిపి రాశాను."

కొంచెం ఆశ్చర్యపోయాను. కలిపి రాయడం దేనికి?

"ఎవరు ప్రచురించారు మాష్టారూ?"

"మంచి పుస్తకాలు ఏసంస్థవారూ ప్రచురించరోయ్. అయినా ఒకళ్ళని మనం ఎందుకు దేబిరిస్తాం? నేనే ప్రచురించాను. రెండు పుస్తకాలకి కలిపి ముప్పై వేలయింది. రేపు సాయంత్రం మీ ఇంటికి వచ్చి ఇస్తాను. నువ్వు తప్పకుండా చదవవలసిన పుస్తకాలు."

ముప్పై వేలా? పదివేల రూపాయల దావాకోసం రెండేళ్ళు కోర్టు చక్కర్లు కొట్టిన మూర్తిగారేనా ఈయన?

కాలేజీనుంచి వచ్చేసరికి నాకోసం ఎదురుచూస్తున్న మూర్తి గారు దర్శనమిచ్చారు. ఆరోజు సంభాషణ అంతా ఆయన పుస్తకాలమీదే నడిచింది. సంభాషణ కాదు. ఆయన చెప్పారు, నేను విన్నాను.

"సృజన ఒక ప్రవాహం. ఎప్పుడు ఎందుకు రాయాలనిపిస్తుందో ఎవరూ చెప్పలేరు. అనేకమార్లు నాకు అర్ధరాత్రి ఒంటిగంటకి రాయాలనే తృష్ణ కలుగుతుంది. రాత్రంతా టేబుల్ మీద రిఫరెన్సు పుస్తకాలు పరుచుకుని రాస్తూనే ఉంటాను. తదేక దీక్షతో ఒక యజ్ఞం లాగా రచన చేపట్టాను. అంత పట్టుదల ఉంది కాబట్టే ఆరు నెలల్లో రెండు పుస్తకాలు

రాయగలిగాను. ఆషామాషీగా రాస్తే ఒక్కో పుస్తకానికి మూడేళ్ళు పట్టి ఉండును. రాయడం ఒక యజ్ఞమయితే రాసిన కాయితాలని, వేయించిన బొమ్మల్నీ పుస్తక రూపంలో తీసుకురావడం ఇంకా పెద్ద యజ్ఞం. ఒక్కో పుస్తకం అయిదు వేల ప్రతులు కొట్టించాను. మనకి స్ఫురించిన ఆలోచనలు ప్రపంచానికి పంచాలి కదా, భారతదేశంలో ఉన్న పెద్ద లైబ్రరీల జాబితా సంపాదించి నా పుస్తకాలు స్వంత ఖర్చుమీద పంపిస్తున్నాను. అన్నట్లు మూడో పుస్తకం అప్పుడే సగంపైగా పూర్తయింది. ఆదివారం ఉదయం కలుస్తాను. రెండు పుస్తకాలు శ్రద్ధగా చదువు. మాట్లాడుకుందాం", అంటూ నిష్క్రమించాడు.

శ్రద్ధగానే చదివాను. కష్టపడి మరీ చదివాను. ఇంకొకరి పుస్తకమైతే అక్కడో పేజీ అక్కడో పేజీ చదివి చేతులు దులిపేసుకుని ఉందును. పుస్తకాలు రాసింది ఇంకొకరు కాదు. ఆరెస్కే మూర్తి. నాజీవితంలో ఎంతో ముఖ్యమైన వ్యక్తి.

పుస్తకాలు చదివి ఎంత దిగులు పడ్డానో భగవంతుడికి తెలియాలి. ఖరీదయిన కాగితం, బొమ్మలకోసం గ్లేజ్‌పేపరు, రెండు పుస్తకాలు హార్డ్ బౌండ్, ఒక్కో పుస్తకం సుమారుగా 200 పేజీలు. విషయం అంతా ఒకే ధోరణిలో నడిచింది. కొన్ని చోట్ల అవే పేరాలు రెండు పుస్తకాల్లో రిపీట్ అయినాయి. Consciousness and human anatomy వంటి శీర్షికలేవో పెట్టాడు. కొన్ని పేజీల్లో బయాలజీ పుస్తకాల్లోంచి యథాతథంగా దించుకున్న బొమ్మలు, కొన్ని నవగ్రహాల బొమ్మలైతే కొన్ని చరిత్రపుస్తకాల పాఠాలు. పుస్తకం నిండా వివేకానంద, రామకృష్ణ పరమహంస, మహాత్మాగాంధీల సూక్తులు, మధ్యలో నవరంగ్ సినిమాలో తలమీద కుండలతో నాట్యం చేస్తున్న సంధ్య బొమ్మ, ఒక చెస్ పొజిషన్, కొన్ని భగవద్గీత శ్లోకాలు. ఏ బొమ్మ ఎందుకు ఉందో, బొమ్మకీ వ్రాసి ఉన్న వాక్యాలకీ సంబంధం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. కొన్ని చాప్టర్లు తెలుగులో ఉన్నాయి, కొన్ని ఇంగ్లీషులో ఉన్నాయి. కొన్ని రెండుభాషల్లో కలగాపులగంగా ఉన్నాయి. కొన్ని ఇంగ్లీషు వాక్యాలు వ్యాకరణదోషాలదృష్ట్యా, మూర్తిగారు స్వయంగా రాసినట్లు తెలుస్తూనే ఉంది. పుస్తకం వెనకాల రచయిత బొమ్మకింద ఆయన అర్హతలు, జీవిత విశేషాలు, ఘనంగా రాసుకున్న ఘనతలు ఉన్నాయి. హతోస్మి.

"పుస్తకాలు రెండూ అందంగా వచ్చాయి మాష్టారూ! పగలూ రాత్రి శ్రమించి, ఎంతో ఖర్చు పెట్టి నిస్వార్థంగా సమాజసేవకి నడుంకట్టే మీలాటి వ్యక్తులు నూటికొకరు కూడా ఉండరు. మీ బాటలో మీరు నడుస్తూ ఉండండి. ఏదో ఒకరోజు ప్రపంచం మిమ్మల్ని గుర్తించక మానదు." అన్నాను ఆదివారం ఆయన కలిసినప్పుడు. నిజం

చెప్పానో అబద్ధం చెప్పానో నా అంతరాత్మకే తెలియదు. కానీ ఆయనకి ప్రియం కలిగించే మాటలు చెప్పాననుకుంటున్నాను. మనలో మాట. దొంగతనంలోనూ ఒక దొరతనం వెలగబెట్టాను. పుస్తకాలు బావున్నాయని మాత్రం అనలేదు. నిన్నటిదాకా చదరంగంలో ఎత్తుకి పైఎత్తులు వేసి ప్రత్యర్థులని గడగడలాడించిన మూర్తిగారు నేడు నేను వేసిన చిన్న ట్రాప్‌కి పడిపోయేంత బలహీనుడయిపోయాడు.

మనిషి ఉనికి ఎందుకింత నిస్సహాయంగా బాహ్యంమీద ఆధారపడి ఉంటుంది? అలా ఆధారపడటం సృష్టి స్వభావం అనుకోవాలా, లేక అదో మానసిక దౌర్బల్యమా? మూర్తిగారికి సమయం సందర్భం చూసుకుని, పుస్తకాలు రాయడం ఆయన ప్రవృత్తి కాదని చాకచక్యంగా చెప్పాలి. వ్యసనమయేలోగా ఆ మోహం నించి ఆయన్ని తప్పించాలి. కాని పిల్లికి గంట ఎవరు కడతారు?

జరిగే నష్టం జరిగిపోతూ ఉంది, ఆయన పుస్తకాలు రాసి ప్రచురిస్తూనే ఉన్నాడు. ఫిక్సెడ్ డిపాజిట్లు కరిగిపోతున్నాయి. పుస్తకాల స్థాయి నానాటికీ తీసికట్టు అవుతోంది. వేరే ఊర్లో ఇంజినీరింగ్ చదువుతున్న నాకు ఆయనపట్ల ఏదో అన్యాయం చేశానన్న అపరాధభావన కృంగదీస్తూనే ఉంది.

దీపావళి శలవులకి ఇంటికి వచ్చాను. మూర్తిగారు నన్ను కలవడానికి ఇంటికి వచ్చారు. ఉభయకుశలోపరి, " ఈ వ్రాతప్రతి చూడవోయ్! అనేక ఆలోచనలు కలబోసి రాశాను", అంటూ కట్టకట్టిన వంద అరతావు పేజీలు నాచేతిలో తపెట్టారు. ఆయన ఎదుటే నాలుగు నిముషాలపాటు పేజీలు అక్కడక్కడా చూశాను. అంతకంటే చూడటానికి అక్కడేమీ లేదని స్పష్టమయింది.

షాక్ ట్రీట్మెంట్ అయితే అయింది. ఇక ముసుగులో గుద్దులాటలు వద్దు.

"మూర్తిగారూ!" ఆయనని అలా ఎప్పుడూ సంబోధించలేదు. "ఇన్ని పుస్తకాలు రాశారు. ఏవిమర్శకుడైనా, ఏ ఒక్క పుస్తకమైనా చదివి బావుందన్నాడా? పోనీ పుస్తకం ఫలానందుకు బాలేదు అని మీకు నిజాయితీగా చెప్పగలిగే ఏ మనిషైనా మీపుస్తకం చదివాడా? ఏ ఒక్క పాఠకుడినైనా మీ పుస్తకాలు కదిలించగలిగాయా? వ్యక్తిత్వ వికాసం, జీవితాలు మార్చివేయడం వంటి పెద్ద పదాలు పక్కన పెడదాం, కనీసం ఒక కొత్త విషయం ఒక్క పాఠకుడికి అందించగలిగారా? మీ నిజాయితీని మీకు మీరే సునిశితంగా ప్రశ్నించుకోగల సామర్థ్యం మీకు ఉందికదా! లైబ్రరీలో వందపుస్తకాలు తీసుకుని

పుస్తకానికో పేజీ చించి, ఆ వంద పేజీలు కుట్టి, సొంపుగా బైండింగ్ చేయించి సమాజంమీద విసిరేయటం సృజన అనిపించుకుంటుందా?"

జీవితంలో నానోట్లోంచి వెలువడిన ఒకే ఒక పరుషమయిన వాక్యసముదాయం అది.

మూర్తిగారు ప్రేమగా విన్నారు. ఆయన పెదవులమీద కాంతివంతమయిన మందహాసం వెలిగింది.

"టైమయింది టప్పయ్యా! ఇక వెళ్తాను. దీపావళి టపాకాయలు జాగ్రత్త!" అని వెనుదిరిగారు.

"మాష్టారూ, మీ వ్రాత ప్రతి..."

"నీ దగ్గరే ఉండనీ."

చటుక్కున లేచి మూర్తిగారికి ఎదుటగా నిలబడి పాదాలకి నమస్కారం చేశాను. ఆయనకి పాద నమస్కారం చేయడం ఇదే మొదటిసారి. ఆయన పాదాలు చేతికి తగిలినప్పుడు కళ్ళు చెమర్చాయి.

★★★

పది రోజుల తర్వాత మా కాలేజీ లైబ్రరీలో తెలుగు వార్తాపత్రిక తిరగేస్తున్నాను. నాలుగో పేజీలో వార్త:

"నిన్నటి తరం చదరంగ చాంపియన్, బాడీ బిల్డర్ ఆర్.ఎస్. కే. మూర్తిగారు వారి స్వగృహంలో పరమపదించారు. దుర్వాసన వస్తోందని గమనించి చుట్టుపక్కల వారు తలుపులు పగలకొట్టి చూస్తే పడకకుర్చీలో ఆయన మృతదేహం పడి ఉంది. ఆయనకి ఎటువంటి అనారోగ్య సమస్యలూ లేవు. సహజ మరణం అని తెలుస్తోంది కానీ, మంచి ఆరోగ్యంలో ఉన్న ధృడకాయుడైన మనిషి అలా అకస్మాత్తుగా ఎలా చనిపోయారో స్థానికులకి తెలియటం లేదు......."

నాకు తెలుసు.

COMMENTS